# గాలితో పోరాటం

## మధురాంతకం రాజారాం

"బాగుందండీ, చాలా బాగుంది. మీ పేరేమో రాధాదేవి. మీ అబ్బాయి పేరు రాధేయ. నామౌచిత్యం ఎంతచక్కగా..."

రాధాదేవి గుడ్లురిమి చూస్తున్నట్టుగా తోచడంతో రమణమూర్తి అర్ధాంతరంగా వాక్యాన్ని తుంచేశాడు. "మన్నించాలి. కొంచెం అధిక ప్రసంగం చేసినట్టున్నాను. రక్తంలో వూరిపోయిన పాతవాసనలు కొన్ని మనిషినిలాగే ఫల్టీ కొట్టిస్తాయి. తలరాత యింకొక రకంగా వుండివుంటే నేనీపాటికి ఏ కాలేజీలోనో లెక్చరర్నుగా వుండవలసింది. ఎం.ఎ.లో నా సబ్జక్టు తెలుగు..." అని సంజాయిషీ చెప్పుకున్నాడు.

"పరవాలేదు. మీ మాటకు నేనేమీ నొచ్చుకోలేదు. కానీ మాటకు మాట బదులు చెప్పడం నా పద్ధతి. డిగ్రీస్థాయిలో నాది హిస్టరీ గ్రూపు! ఫార్ యువర్ ఇన్‌ఫర్మేషన్, చెబుతున్నాను. గౌతమీ పుత్ర శాతకర్ణి అని, వాశిష్ఠీ పుత్రపులమావి అనీ కొన్ని రాజవంశాల్లో సైతం తల్లి పేరుతో కలిపి బిడ్డలకు పేర్లు పెట్టుకుంటూ వచ్చారు. మగవాడికి కిరీటం రావడమంతా తరువాత్తరువాతనే!"

మేయబోయి మెడ తగిలించుకున్నట్టుగా దిక్కుమొగం పెట్టేశారు రమణమూర్తి. బుద్ధిమాలి ఒక మాట నోరు జారినందుకు ఈమె తనకు సరిగ్గానే శాంతి పాఠం చెప్పేసింది! ఇప్పుడిక ఈమెతో నామౌచిత్య చర్చలు పెట్టుకోకుండా, సూటిగా అసలు విషయంలోకి చొచ్చుకుపోవడమే తనకు శ్రేయస్కరం!

రాధాదేవి రాసి తెచ్చిన రిపోర్టును మళ్ళీ ఒకసారి చదువుకోసాగాడు రమణమూర్తి.

"పోలీస్ ఇన్‌స్పెక్టరుగారికి
టూ టవున్ పోలీస్ స్టేషన్

అయ్యా,

14—15 సంవత్సరముల వయస్సుగల నా కుమారుడు రాధేయ గడచిన శనివారం మధ్యాహ్నం నుంచీ కనిపించడం లేదు. ఎత్తు నాలుగడుగుల ఆరంగుళాలు. లేత పసుపురంగు దేహచ్ఛాయ. గుండ్రని ముఖం. దువ్వకపోయినా చెదరని క్రాపింగు. గొంతుపైన ఎడమ పార్శ్వంలో చిన్నపుట్టుమచ్చ. తెలుగుతోబాటు ఇంగ్లీషు కూడా మాట్లాడగలడు... కాపీ తీయించి అబ్బాయిని నాకప్పగించగోరినాను.

ఇట్లు
రాధాదేవి,
ఉపాధ్యాయిని,
ఝాన్సీలక్ష్మి బాలికోన్నత పాఠశాల"

అక్కడక్కడ క్రీగీతలు గీస్తూ వచ్చి చివరకు పెన్సిలును బల్లపైన పడేస్తూ అడిగాడు రమణమూర్తి—

"కుర్రాడికి పదిహేనేళ్ళొచ్చాయంటున్నారుగదండీ! బహుశా ఎస్సెస్సీలోకి వచ్చివుండాలి. పరీక్షలో తప్పిపోవడంలాంటిదేమీ కాదుగదా?"

"అబ్బే, అదేం మాట! ఎస్సెస్సీలో వాడు స్కూలుకంతా ఫస్టొచ్చాడు. కొంచెంలో రాంకు తప్పిపోయింది. ఇప్పుడిక జూనియర్ కాలేజీలో చేర్పించడమే తరువాయి..."

"పరీక్షలో వచ్చిన మార్కుల్నిబట్టి చూస్తే మీ అబ్బాయి బాగా తెలివైనవాడిలా వున్నాడు. తెలివైన వాళ్ళు సాధారణంగా బుద్ధిమంతులుగా కూడా వుంటారు. అయితే మీకైనా అకారణంగా కోపం వచ్చి వుండదు. మీరు కోపం కలిగేటంతగా మీ అబ్బాయి ఏదో చేసివుండాలి..."

ముఖంలోని చిరాకును కప్పిపుచ్చుకోవడానికి విఫల ప్రయత్నం చేస్తూ అంది రాధాదేవి. "ప్రత్యేకించి ప్రబలమైన కారణమేమీ లేదు. మామూలు గొడవే. కుర్రవాళ్ళు తవకిష్టంలేని పద్ధతిలో నడుచుకుంటే పెద్దలు కోప్పడకుండా వుంటారా? అకాడికీ నేనేం చేయి చేసుకోలేదు. కేవలం మందలించడం మాత్రమే. ఆ మాత్రానికే ఈ కుర్రకుంక యింతటి అఘాయిత్యం చేస్తాడని ఎలా అనుకోగలను?"

"చూడండి రాధాదేవిగారూ! మీరొక విషయాన్ని గమనించాలి. ఇతరుల వ్యక్తిగతమైన విషయాల్లో జోక్యం పెట్టుకోడం కుసంస్కారమనుకుంటే నేనొక్కరోజైనా ఈ పోలీసుద్యోగం చేయలేను. కుర్రాడు ఇంట్లో నుంచి వెళ్ళిపోయాడని రిపోర్టివ్వడం కోసం మీరిక్కడికి వచ్చారు. అతడలా వెళ్ళిపోవడానికి దారితీసిన సంఘటన గురించి స్పష్టంగా తెలుసుకోడం నా బాధ్యత......" నిక్కచ్చిగా చెప్పినాడు ఇన్‌స్పెక్టర్.

తన చేతిలోని వానిటీ బ్యాగును టేబిలుపైన పడేసింది రాధాదేవి. ఇక చెప్పక తప్పదన్న నిర్ణయానికి వచ్చినట్టుగా కుర్చీలో సర్దుకుని నిటారుగా కూచుంది. "వాడు మ్యాట్నీకి వెళ్తానన్నాడు. నేనేం వద్దనలేదు." 'మంచిదిరా బాబూ, చిన్నాను గూడా తీసుకెళ్ళు'— అన్నాను. అదేనండీ నా తప్పు! అన్నట్టు చిన్నా అంటే ఎవరో కాదు. మా అమ్మాయి, స్వయంగా వాడి చెల్లెలు..."


"అందుకతడేమన్నాడు?"

"అనడం కాదండీ, అరిచాడు. ఆడవాళ్ళను నేను నావెంట తీసుకెళ్ళను. అంతగా పంపాలనుకుంటే ఆ పిల్లను ఆడవాళ్ళతోనే పంపించు? అని గొంతుచించుకున్నాడు. పద్నాలుగోయేడు వెళ్ళి పదిహేనోయేడు వచ్చిందో లేదో, ఈ కుర్రవెధవకు ఆడా మగా తేడా యింతగా తెలిసొచ్చిందా? 'పిలుచుకపోక పోయావో, నీ డొక్క చీరేస్తాను' అన్నాను. 'డొక్క చీరేసినా సరే, గొంతు కోసేసినా సరే, నేను చిన్నాను నావెంట తీసుకెళ్ళను' అంటూ అల్టిమేటం జారీచేశాడు. నిజం చెప్పాలి గదండీ! నాకు పట్టరానంత కోపం వచ్చింది. అలాగైతే నా యింట్లో వుండొద్దన్నాను..."

"ఎలాగైతేనేంలెండి! అభిమానంలో తానుగూడా మీ కుమారుడేనని నిరూపించుకున్నాడు......"

"అభిమానం కాదండీ, అహంభావం!" ఉరిమినట్టుగా అంది రాధాదేవి— "నేను మంచం పైన పడుకుంటాను. పరవాలేదు, నువ్వు నేలపైన పడుకో. ఉన్నదొకటే పండు, నేను తినేస్తానులే. నువ్వూరుకోనమ్మ. పత్రిక యిప్పుడే వచ్చిందిగదా, మొదట నేను చూడనీ, నింపాదిగా నువ్వు రేపుదయం చూచుకుందువు గానీలే! చిన్నపిల్లల దగ్గరినుంచి యిదండీతంతు! ఆ పిల్లకూ వీడికి రెండేళ్ళే తేడా. అయితే మాత్రం! ఆడపుట్టుకగదా! అందుకే అంతచులకన. పోనీ, కుర్రాడు గదా అంటారేమో! కుర్రాళ్ళ సంగతి వొదిలేయండి. పెద్దవాళ్ళు మాత్రం? మాతృదేవోభవ అంటూ వంగి





మాటలు పలకడానికి సిద్ధం. బిడ్డలెందరని అడిగి చూచారో, రెండు ప్లస్, మూడు మైనస్ అంటారు. మన సమాజంలో ఆడదాని పరిస్థితి ఎంత నికృష్టంగా వుందో తెలుసుకోడానికి ఈ దృష్టాంతం ఒక్కటే చాలు! మళ్ళీ మహిళలు ఎక్కడ పూజింపబడుదురో, అక్కడే దేవతలు సంతోషింతురు అని ధర్మసవ్నాలు! ఛీ ఛీ!

సిగ్గులేక పోతేసరి......"

వేరని మగవారు క్షీరాబ్ది చిలికారు.

కావున్నె మునుముందు గరళము పుట్టె — అని మునుపటికొక్క నారీశిరోమణి మగవాళ్ళని దులిపి పారేసిందట! రాధాదేవి ధోరణి అంతకంటె సుతిమెత్తనగా మాత్రం లేదు. కోపమో, కక్షో, కార్పణ్యమో, భావావేశం ఎట్టిదైనా కానీ, రాధాదేవి ముఖం దర్శనీయంగానే వుంది. ఆడవాళ్ళను ఫేర్ సెక్స్ అని అనడం అందువల్లనే కాబోలుననుకున్నాడు రమణమూర్తి.

అందుకు విరుద్ధంగా మగవాళ్ళు వట్టి మొద్దురాయళ్ళన్నారు. కొన్నికొన్ని సందర్భాల్లో కొందరు ఆడవాళ్ళకు మగవాళ్ళవల్ల అన్యాయం జరిగివుండొచ్చు. కానీ అందుకనీ మగజాతినంతా సమూలంగా ద్వేషించడం ఏం న్యాయం? ఆడదాని అనుగ్రహం కోసం ఒక ఋషిసత్తముడు కొన్నివేల సంవత్సరాల తపోదీక్షను బుగ్గి పాలు చేసుకున్నాడు. ఆడదాని ప్రణయం కోసం ఒక మగ మహారాజు తన సామ్రాజ్యాన్ని తృణప్రాయంగా విసర్జించాడు. ప్రేమించిన స్త్రీని పొందడం కోసం ఎందరో మేటి మగలు యుద్ధరంగంలోకి దిగి వేలకొలది మంది సైనికుల్ని బలిదానం గావించుకున్నారు. ఆడదానికి సంబంధించిన ఆకర్షణ దీపజ్వాలలాంటిదైనప్పుడు, పురుషుడందులో పడి పదిరెక్కలు రాల్చుకునే శలభమే గదా! వందకేసులు తీసుకుంటే అందులో ఏ ఒకటో రెండో కాస్త ఒరగద్దంగా వుండొచ్చు. అయితేమాత్రం? బిడ్డ కనిపించక పోయిన పరిస్థితిలో ఒక తల్లి యిలా మాట్లాడగలగడం ఆశ్చర్యమే!

కానీ యిందును గురించి మరింత లోతుగా వర్ణించడానికి పోలీస్‌స్టేషన్ మాత్రం తగినచోటు కాదని, రమణమూర్తి కచ్చితంగా నిర్ణయించుకున్నాడు. ఇంతకు మునుపు ఆమె చెప్పిన మాటలేవీ తన బుర్రకెక్కలేదన్నట్టుగా నటిస్తూ "మేడమ్! ఇంకొక ప్రశ్నమాత్రం




అడగాలండీ! అబ్బాయి శనివారం మధ్యాహ్నం నుంచీ కనిపించకపోయాడుగదా! ఆదివారమంతా మీరు ఉలక లేదు. పలకలేదు. సోమవారం సాయంకాలానికిగానీ పోలీసులకు రిపోర్టివ్వాలని అనిపించలేదు. ఇందుకేదైనా కారణం వుంటే వివరించగలరా?'' అన్నాడు.

భలేవాడివే! నీ పోలీసుబుద్ధి అంతా నా దగ్గర చూపిస్తున్నావే — అన్నట్టు తలపంకించి రాధాదేవి "ఒకటి రెండు రోజులూరుకోడంలో పెద్ద ఎత్తుగడ ఏదో వుందనుకోవద్దు! కుర్రాదు ఎక్కడికైనా వెళ్ళి పోతాడన్నది నేను కలలోనైనా ఊహించని విషయం! ఎక్కడికైనా వెళ్తే తిరిగొస్తాడని వేచి చూడడం మామూలు! ఎప్పుడెప్పుడు కనిపించకుండా పోతాడా! ఎప్పుడు పోలీస్ స్టేషన్‌కు వెళ్ళి రిపోర్టుచేద్దామా అని కాచుకుని కూచున్నదాన్ని కాదు గదండీ! అదీ కారణం...''

మంచి బాలుడు రామూలా ఎంతో బుద్ధిగా రాధాదేవి మాటల్ని ఆలకించిన ఇన్‌స్పెక్టర్ రమణమూర్తి "సరే నండీ! ఇంక మిమ్మల్నేమీ అడగవలసిన అవసరం లేదు. వెళ్ళిరండి. కుర్రాడి ఆచూకీ తీయడానికి శాయశక్తులా ప్రయత్నిస్తాం'' అన్నాడు.

రాధాదేవి వెళ్ళిపోయాక గూడా చాలాసేపటివరకు రమణ మూర్తి ఆలోచిస్తూ వుండిపోయాడు. అయితే అతడి ఆలోచన ఈసారి రాధాదేవి పైనుంచీ కొంచెం వైదొలగి ఒకానొక అపరిచిత పురుషవ్యక్తిపైకి ప్రసరించింది. పాపం, అతడి పేరేమిటో, ఎక్కడుంటాడో, ఏం చేస్తుంటాడో రమణమూర్తికి తెలియదు, కానీ కన్న బిడ్డలో సైతం పురుషాధిక్యతాభావాన్నే చూడగలిగిన ఓ స్త్రీతో అతడెలా సాహచర్యం నెరపగలిగాడో, ఎంత వరకూ సహజీవనం చేయగలిగాడో రమణమూర్తికి బొత్తిగా బోధపడడంలేదు. ఒకటి: అతడు విడాకులైనా పుచ్చుకుని వుండాలి. రెండు: సంసారంపట్ల విరక్తిపొంది సన్యాస మైనా స్వీకరించివుండాలి. ఆ హత భాగ్యుడి సమస్యకు అంతకు మించిన పరిష్కారాన్ని రమణమూర్తి ఊహించ లేకపోయాడు.

పోలీస్ స్టేషన్‌లో రమణమూర్తి ఇలా ఒక మగ ప్రాణి పట్ల సానుభూతి ప్రకటించుకుంటున్న సమయానికి సరిగ్గా రాధాదేవి హెడ్ పోస్టాఫీసులో టెలిగ్రాం ఫారం నింపుతూ వుంది. పైన అడ్రసు రాసి ముడిచిన తర్వాత క్రింద విషయ వివరణ ప్రారంభించింది. 'రెండు రోజులనుంచీ రాధేయ కనిపించడంలేదు. ఎక్కడికి వెళ్ళాడో తెలియదు. ఇంతకు ముందే పోలీస్ స్టేషన్‌లో రిపోర్టు యివ్వడమైంది' చివరగా 'తక్షణం బయలుదేరి రావలెను' అని రాసి వుండవలసింది. రెండు పదాలేగదా. ఛార్జీ ఇంకొక అర్థరూపాయి పెరిగినందువల్ల పెద్ద ప్రమాదమేమీ లేదు. నిజానికామె చేతిలోని కలం అసంకల్పితంగా ఆ రెండు మాటలు వ్రాయడానికి ముందుకురికింది. కానీ ఎవరో సూదితో పొడిచినట్టుగా ఉలిక్కిపడి కలాన్ని పైకి తీసేసుకుంది రాధాదేవి. 'అబ్బే, కలానికెక్కడ బుద్ధుంటుంది? అదిగూడా మగవాడు తయారు చేసిందేనాయె!'

రాధాదేవిని గురించి గిట్టనివాళ్ళు ఎన్నయినా చెప్ప కోవచ్చు. కానీ ఆమెకు గల మానసిక స్థైర్యం మాత్రం నిరుపమానమైనదని ఒప్పుకోవాలి. అదే మరొకరు, మరొకరూ అయితే బిడ్డ కనిపించకపోయినందుకు దిగాలుపడి, నలుగురితోనూ అంగలార్చుకుని, నానా రభస కావిస్తూ తమచేతకాని తనాన్నంతా ఎగ్జిబిషన్‌లో పెట్టివుందురు! రాధాదేవి గనుక నిగ్రహంగా నిలబడ గలిగింది. కానీ తప్పంతా భగవంతుడిది! మనసుకున్నంత పిడివాదాన్ని ఆయన శరీరానికివ్వలేదు. సాయంకాలపు పసిమిరంగు సూర్యకాంతుల్లో రోడ్డుపైన నడుస్తున్న రాధాదేవికి ఎందుకో నీరసంముంచుకొచ్చినట్టుతోచింది. తను నిజంగా నడుస్తూ వుందా, గాలికి కొట్టుకుపోతుందా- అన్న సందేహం ఎదురైంది. తొట్టిలో ముంచి లేవనెత్తిన పంచవర్ణచిత్రంలా ఆమె కళ్ళ ఎదుటి దృశ్యాలన్నీ అలుక్కుపోయినట్టు అయోమయంగా కనిపిస్తున్నాయి. ఈ విడ్డూరానికి హేతువేమిటా అన్న విచికిత్స ఆమెలో కలగకపోలేదు. కారణం వెంటనే స్ఫురించిందిగూడా! తాను సరిగ్గా భోజనం చేసి రెండురోజులైంది. తిన్న శాస్త్రం మాత్రమే వెళ్లిస్తూ వుందన్నమాట! అరరే, తానెందుకలా చేసింది? ఎవరు చేయించారు? తనకు తెలియకుండానే తనపైన కుట్రచేయగల ఆ అనూహ్య శక్తులెక్కడున్నాయి? దొరికితే వాటి జుత్తు పట్టుకుని ఆ లెంప, ఈ లెంప అదరగొట్టాలన్నంతగా రాధాదేవి ఉద్వేగపడిపోయింది...

మేడపైన వున్న వాటాలో రాధాదేవి కాపురం. మెట్లెక్కుతుంటే ఊపిరితిత్తులు కొలిమితిత్తుల్లా రొప్ప సాగాయి. రెండే రెండు రోజుల వ్యవధిలో తనలో ఇలాంటి మార్పొచ్చినందుకు రాధాదేవి విస్తుపోయింది.

శాలువా ముందర జుట్టుకుని మంచంపైన ముడుచుకుని పడుకున్న చిన్నా గుమ్మందగ్గర తల్లి నీడ కనిపించగానే తలపైకెత్తి "మమ్మీ! అన్నయ్య కనిపించాడా?'' అని అడిగింది. ఎంతకూ బదులు లేకపోయేసరికి "ఏం మమ్మీ? అన్నయ్య పోలీసులకు కూడా కనిపించలేదా?'' అంటూ వాపోయింది. నీతోనాకు పెద్ద గొడవే వచ్చిపడిందే చిన్నా! నీపాటుకు నువ్వూరుకోగూడదూ? నా అవస్థలేవో నేను పడుతున్నానుగా'' అంటూ గదమాయించింది రాధాదేవి.

నీరసంగా ప్రేము కుర్చీలోకి చేరగిలబడిపోయిన రాధా దేవి తానెంతసేపలా కూర్చుండిపోయిందో తెలియదు. కళ్ళు తెరిచే సరికి చీకట్లు క్రమ్ముకున్నాయి. ధిగ్గునలేచి లైటువేసింది. ఓపికనంతా కూడదీసుకుని వంటపనులు ముగించింది. "భోంచేసి పడుకుందాం రావే చిన్నా!'' అని కుమార్తెను పిలిచి చూచింది. అమ్మాయిలో కదలికలేదు. ఏదో అనుమానం వచ్చి, దగ్గరగా వెళ్ళి బిడ్డ ఒంటిపైన చేయివేసి చూచింది. నిప్పురగిలించిన కుంపటిలా ఆ పిల్ల ఒళ్ళు ప్రేలిపోతూ వుంది.

'చాలని దానికి ఇది కూడా ఒకటా?' అనుకుంటూ రాధాదేవి హతాశురాలైపోయింది.


మరునాటి ఉదయం ఆమె చిన్నాను డాక్టరు దగ్గరకు తీసుకెళ్లింది. ప్రిస్క్రిప్షన్ కాగితంతో బాటు డాక్టరు గారు "బిడ్డ మానసికంగా షాక్ తిన్నట్టుందమ్మా! కాస్త ఉల్లాసంగా వుండేటట్టు చూచుకోవాలి'' అన్నాడు.

డబ్బుకు దొరికేవస్తువైతే కొనగలిగేదే రాధాదేవి, ఉల్లాసం ఏ బజార్లో దొరికే వస్తువు?

మళ్లీ రెండు రోజులు గడిచాయి. రాధేయ ఆచూకీ తెలియనూలేదు, ఇప్పుడా యింట్లో కాలం గడవడమంటే చీకటి సొరంగం గుండా ప్రయాణం చేసినట్టే వుంది. అబ్బాయి సంగతేమైనా తెలిసిందా అని ఇరుగు పొరుగు అమ్మలక్కలు పరామర్శించడంగూడా కరువైపోయింది. వాలకాన్ని బట్టి చూస్తే వాళ్లు రాధాదేవి పట్ల ఏదో ప్రతీకారం తీర్చుకుంటున్నారల్లే వుంది. భర్తతో భార్య, భార్యతో భర్త సర్దుకపోయే కాపురాలను రాధాదేవి వట్టి ప్రహసనాల్లా భావిస్తూ వచ్చినమాట నిజమే! ఇప్పుడు వాళ్ళు తన కాపురాన్నే ప్రహసనంగా లెక్కగడుతున్నారేమోనని రాధాదేవి అనుమానించసాగింది. అయినా, తన తప్పేమిటో ఆమె కర్థంగాలేదు. పెళ్లి కాగానే ఆమె తన షరతులన్నీ భర్తకు అప్పగించింది. 'ఉద్యోగం చేస్తూ నా కాళ్లపైన నేను నిలబడాలనుకుంటున్నాను. మీకేమైనా అభ్యంతరమా?'' అంది రాధాదేవి. 'అయ్యో, నాకేమభ్యంతరం? ఎంత భార్యా భర్తలైనా ఒకరి కాళ్లతో ఇంకొకరు నిలబడాలనుకోడం అన్యాయం.

నువ్వూ నాలాగే సంపాదనాపరురాలివి కావచ్చు. అదే నా అభిమతం గూడా!' అన్నాడు విజయసారథి. 'నాకిష్ట

మైన వస్తువులు, దుస్తులు నేనే కొనుక్కుంటాను మీకేమీ ఆక్షేపణ వుండదనుకుంటాను' అంది రాధాదేవి మరీ మంచిది. నాక్కావలసిన వస్తువులు గూడా నువ్వే కొనిపెట్టు. నికిష్టమైనవాటిని వాడుకోడమే నా కిష్టం' అన్నాడు విజయసారథి. 'నేను సాధారణంగా అర్థరాత్రి వరకూ చదువుకుంటూవుంటాను. అందువల్ల ఉదయం నిద్రలేవడంలో ఆలస్యమవుతుంది. మీకేమైనా యిబ్బందా?' అంది రాధాదేవి. 'అబ్బే, యిబ్బంది ఏముంది? రాత్రి చాలాసేపు మేలుకున్న తర్వాత ఎవరైనా తొలికోడితో నిద్రలేస్తారా? పరవాలేదు. నాకేమో అయిదింటి తర్వాత నిద్రపట్టదు. లేచి బాయిలర్‌లో నిప్పువెయ్యడమూ, యింత కాఫీ చేసి ఫ్లాస్కులో పోయడమూ నాకేం కష్టంగాదు. బెడ్‌కాఫీ అలవాటు లేకపోతే. నువ్వు ముఖం కడుక్కునే తాగొచ్చు' అన్నాడు విజయసారథి. 'మీకు అన్నదమ్ముళ్లు, అక్కచెల్లెళ్లు యింకా బంధువులు బోలెడుమందే వుండొచ్చు. కానీ వాళ్ళు తరచుగా వచ్చి తిష్ఠవేస్తే వంటా వడ్డనా చేసి పెట్టడం నావల్ల కాదు' అంది రాధాదేవి. 'ఛా, ఛా వాళ్లకేం పనీపాటూ లేదా? రమ్మంటే మాత్రం వస్తారా? అంతగా వచ్చారనుకో, హోటలు నుంచి కారియర్ తెప్పిస్తే పోలా?' అన్నాడు విజయసారథి. బొత్తిగా వ్యక్తిత్వంలేని ఈ మనిషితో ఎలావేగడమమ్మా అని కుంగిపడి పోయింది రాధాదేవి. అయితే యిది నిజస్వభావమా, కాక ఏదైనా గొప్ప ఎత్తుగడకు నాందీ




వాచకమా — అన్న వివికల్పంలో పడిపోయింది. కానీ కానీ, ఈ పెద్దమనిషి నిజస్వరూపం బయటపడే సందర్భం రాకపోతుందా —అని నిరీక్షిస్తూ వచ్చింది.

ఆరేళ్ళ క్రిందట ఆ సందర్భం కూడా రానేవచ్చింది. అప్పటికి రాధేయ అయిదో తరగతిలోవున్నాడు. చిన్నాకు ఏడేళ్ళు. విజయసారథికి ఉద్యోగంలో ప్రమోషను వచ్చింది, బదిలీతోబాటుగా. రెండు జిల్లాలవతల వున్న వూరు వెళ్ళక తప్పని పరిస్థితి. కాపురం మార్చే విష యంలో భార్యాభర్తల మధ్య పేచీ వచ్చింది. 'భర్త వెళ్లినట్టల్లా అతని వెంటపడి తిరగడానికి నేనేమీ సీతాదేవినిగాను. నా ఉద్యోగం నాకు ముఖ్యం. ఎట్టి పరిస్థితిలోను దీన్ని వదులుకోను' అంటూ తేల్చి చెప్పి వేసింది రాధాదేవి. 'నా మాటకాస్త ఆలకించవగూడదా రాధీ?' అంటూ గింజుకున్నాడు విజయసారథి. 'ప్రమోషను వచ్చింది గనుక నాకెల్లాగూ రెండువేల దాకా ముదుతుంది. మనం ఉన్నదంతా నలుగురం. సుఖశాంతుల కోసం డబ్బు సంపాదించాలే గానీ, డబ్బు కోసం వాటిని దూరం చేసుకుంటామా? అంతగా ఉద్యోగం చేసే తీరాలనుకుంటే, అక్కడైనా ప్రయత్నించవచ్చు గదా' అని శతవిధాలుగా చెప్పి చూచాడు. అమ్మో, ఈ మెరమెచ్చు మాటలకు మోసపోయ్యేదేనా రాధాదేవి!

ఉపాధ్యాయ జీవితంలో సెలవు రోజులు హెచ్చుయిన మాటనిజమే. కానీ ఆ సెలవుల్లోనైనా భార్యా భర్తలిద్దరూ కలిసివుండే వెరవు లేకపోయింది. 'సెలవు రాగానే భార్య రెక్కలుగట్టుకుని వెళ్లి భర్త సాన్నిధ్యంలో వాలిపోవాలా ఏమిటి? అంతగా అవసరమనుకుంటే అతగాడే రమ్మని రాయొచ్చుగదా? రాశాడే అనుకుందాం. అతడి మాట శాసనమా ఏమిటి? ఏం, తన కిష్టమైనప్పుడే వెళ్తుంది...' ఇలాంటి పట్టింపులతో సెలవుల పుణ్యకాలం కాస్తా కరిగిపోతూ వచ్చింది.

ఏ తత్ఫలితంగా అయ్యకూ అమ్మకూ మధ్య అంతంత



మాత్రం అనుబంధాలతో అయిదారేళ్లుదొర్లిపోయాయి.

ఒక భార్యగా రాధాదేవి సాంసారిక జీవితంలో తాను సాధించుకోదలచుకున్న హక్కులన్నీ సాధించుకుంది. కానీ ఆ హక్కుల వల్ల తానేపాటి ఆనందాన్ని పొంద గలిగిందో ఆమె కంతుచిక్కలేదు. తాను విజయంలో ఓటమిని చవిచూస్తూ వుందా? ఓటమిలో విజయాన్ని ఊహిస్తూవుందా?

రాధాదేవి యిలాంటి ఆలోచనల్లో తల మునకలవు తుండగా చీకటి సారంగంలోకి ఒక ఆశాకిరణం చొచ్చు కుని వచ్చినట్టయింది. రాధాదేవి యిచ్చిన టెలిగ్రాంకు ప్రత్యుత్తరంగా విజయసారథి దగ్గిరినుంచి గూడ ఒక టెలిగ్రాం అందింది. 'అబ్బాయిని గురించి బెంగ పడొద్దు... సురక్షితంగా వున్నాడు'—ఇంతే సంగతులు!

అలాంటి శుభవార్త ఏ తల్లికైనా విధిగా ఆనందం కలిగించాలి. రాధాదేవికైనా ఆనందం కలగకపోలేదు. కానీ ఆనంధం, అనురాగం, అభిమానం లాంటి సహజోద్రే కాలకు అక్కడికక్కడే ఆనకట్టలువేసి, తెచ్చికోలు భావ రాగాలను తన మనసులో నాటుకుంటూ వచ్చింది రాధాదేవి. చెట్లుగా, మహావృక్షాలుగా వాటిని పెంచు కుంటూ వచ్చింది. దారిలేని అడివిలా తయారయ్యాక యిప్పుడందులోనుంచీ ఎలా బయటపడుతుంది?

—అబ్బాయి సురక్షితంగావున్నాడా? ఎక్కడున్నాడు? అక్కడికెలా వెళ్లగలిగాడు? వాడికింత తెంపరితనం ఎలా వచ్చింది? ఈ ప్రశ్నలకయితే సమాధానం లేదు. పైగా 'బెంగపడొద్దు' అంటూ ఒక డాబుసరిమాట గూడానా! భగవంతుడు భక్తుడికి అభయం యిచ్చినట్టుఏమిటమ్మా ఈ ఫోజు?

ఉండివుండి ఎట్లాగో ధైర్యం కూడదీసుకుని అడిగింది చిన్నా. "అన్నయ్య నాన్నగారిదగ్గిరికే వెళ్లిం టాడు. మనం వెళ్లి చూచొద్దామా మమ్మీ?"—అని.

ఆ పిల్లకు గనుక ఒళ్లు బాగుంటే సాచి ఒక చెంప కాయ యిచ్చివుండేదే రాధాదేవి. కొట్టడం మాట దేవు డెరుగు. కోరికతీర్చకపోతే అమ్మాయి ఆరోగ్యం మరిం తగా బెడిసిపోయేటట్టుంది.

ఎనిమిది గంటల వ్యవధిలో ఎక్స్‌ప్రెస్ రైలుబండి తల్లీ కూతుళ్లని గమ్యస్థానంలో దిగబెట్టింది. ఆటో యింటికి చేర్చింది. చిన్న పూలతోట మధ్య విజయ సారథి నివాసం తీర్చిదిద్దిన బొమ్మరిల్లులా వుంది. ఇంట్లో అడుగుపెట్టగానే టేప్‌రికార్డరులోనుంచీ సన్నటి వీణాగానం శ్రవణ సుభగంగా వినిపించింది. ఆఫీసుకు వెళ్లడంకోసం దుస్తులు మార్చుకుంటున్నాడు విజయ సారథి. రాధేయ కొత్తగా కొనుక్కున్న పుస్తకాలకు అట్టలు వేసుకుంటున్నాడు.

భర్త యింట్లో భార్యకు సముచిత సత్కారం లభిం చిందనే చెప్పాలి.

"వచ్చేశావా రాధీ! నేననుకుంటూనే వున్నాలే, నువ్వొస్తావని! అన్నట్టు ప్రయాణం సవ్యంగా జరిగింది గదా! ఒరేయ్, అబ్బాయ్! బాయిలర్‌లో నిప్పుండాలిగానీ, కాస్త బొగ్గులువెయ్యి! నీళ్ళు కాగితే మీ అమ్మ స్నానం చేస్తుంది. చూచావా రాధీ! కుర్రవెధవ ఎంత పనిచేసే శాడో! నేను బాగా బుద్ధి చెప్పాలే. వాడు నీకు ప్రాబ్లం కాకుండా చూచుకునే పూచీనాది! నేను ఆఫీసుకు వెళ్తూ

## మార్క్సిస్టు మిత్రునికి


తడారి పోయిన
ఎడారి ఇసకలో
ఒత్తిగిలి పడుకున్న
నత్తగుల్లకి
నీ మార్క్సిజం మహా సముద్రం
నిన్ను విడిచి ఎన్నడో ఇంకిపోయింది
నీ చెవిలోని హోరు
ఇంకా అదేననుకుంటున్నావు

-ఇస్మాయిల్

టిఫిను పంపిస్తాను. ఆలోగా నువ్వూ, చిన్నా స్నానం చేయండి. మధ్యాహ్నం హోటల్‌నుంచీ కారియరొ స్తుంది. భోంచేసి హాయిగా రెస్టుతీసుకో అయిదింటికల్లా నేనింటి దగ్గరుంటాను..."

—అయిదేళ్ళ పసిపిల్లతో వ్యవహరించినట్టు ఏమిటీ ధోరణి? రాధాదేవి లోలోపల రుసరుసలాడిపోయింది. కానీ ఎదుర్కోడానికి తగిన కారణమేదీస్ఫురించడంలేదు.

ఆనాటి సాయంకాలం విజయసారథి బిడ్డలనిద్దరినీ గుడికి తీసుకెళ్లాడు. మరునాటి సాయంకాలం సినిమా ప్రోగ్రాం పెట్టుకున్నాడు. ఆ మరునాడు ఎగ్జిబిషన్ చూపించాడు. ఇందులో విజయసారథిని తప్పుబట్టవలసిన ప్రసక్తేలేదు. ఎందుకంటే ప్రతిరోజూ బయటికి వెళ్లే ముందు అతడు 'నువ్వూ రారాదా రాధీ?' అంటూ భార్యను అర్థిస్తూవచ్చాడు. మొగమాటానికి పోయి 'నేరాను' అంటూ వచ్చింది రాధాదేవి. అంతటితో ఆమె ఉనికినే మరచిపోయి వాళ్లు మాట్లాడుకుంటూ, నవ్వుకుంటూ, ఆకాశానికి మూడే బారలున్నంత ఉత్సాహంతో బయటికి వెళ్లిపోతూవచ్చారు. వాళ్లలా వెళ్లి పోయాక ఎక్కడలేని ఏకాకితనం తనను ఆవరించినట్టే వుండేది రాధాదేవికి. తనకేదో అన్యాయం జరిగిపోతు




న్నట్టు ఏదో వుక్రోషం బుసలుగొట్టేది. చివరకు కళ్ల నిండుకు కన్నీళ్లు క్రమ్ముకునేవి.

నాలుగోనాటి ఉదయం చెప్పింది రాధాదేవి. "నే నయిదు రోజులు సెలవుపెట్టి వచ్చాను. ఈ రోజు సాయంకాలం వెళ్లిపోవాలి..."

"అట్లాగే, నువ్వు సిద్ధంగా వుండు. నేను నాలు గ్గంటలకల్లా వచ్చి నిన్ను రైలెక్కిస్తాగా!" అన్నాడు విజయసారథి.

నిజానికిప్పుడు అనారోగ్యం చిన్నాను వదిలిపెట్టి తననే పట్టుకున్నట్టు తోచింది రాధాదేవికి. ఎంతగా ఓపిక లేకపోయినా మూలకొకటిగా పడివున్న తన బట్టలన్నిం టినీ తీసుకొచ్చి పెట్టెలోకి సర్దింది. 'ఏమిటే చిన్నా! నీ బట్టలు తీసుకొచ్చి పెట్టెలో పెట్టరాదూ?" అంటూ కూతుర్ని హెచ్చరించింది. ఆ పిల్లకామాటవినిపించిందో లేదో! వినిపించే వుంటుందని ఆశించింది రాధాదేవి. వినిపించకపోవడానికి ఆపిల్ల ఏమైనా ఆమడల దూరంలో వుందా? ప్రక్కగదిలోనే గదా!

కానీ తీరా బయల్దేరవలసివచ్చేసరికి పెట్టెతెరిచి చూస్తే అందులో చిన్నా బట్ట ఒక్కటైనా లేదు. 'ఇదిగో చిన్నా! నీ బట్టలేవీ?' అంటూ రాధాదేవి చిరాకు పడిపోయింది. ఆమె ప్రశ్నకు సమాధానంగా గుమ్మంలో నుంచీ చిన్నా తల మాత్రమే రాధాదేవికి కానవచ్చింది. "నేను నాన్నగారి దగ్గరే వుంటాను మమ్మీ! నువ్వూ వుండిపోరాదూ?"— మరుక్షణాన ఎట్టి ఉత్పాతం జరుగుతుందో తెలియక చిన్నా తూనీగలా పెరట్లోకి పారిపోయింది.

తలగ్రుర తిరుగుతున్నట్టై క్రిందికి వాలిపో బోయింది రాధాదేవి. తటాలున చేతుల్లోకి తీసుకుని ఆమెను మెల్లగా సోఫా దగ్గిరికి నడిపించాడు విజయ సారథి. సోఫా పట్టెపైకి వాలిపోతూ రాధాదేవి వెక్కిళ్లు పెడుతూ భోరున ఏడవసాగింది.

"ఛా. పిచ్చిదానివిలే రాధీ! ఇలా ఏడవొచ్చా? నిన్నెవ రైనా యిక్కడినుంచీ వెళ్లిపొమ్మన్నారా? ఒకరికొకరం తోడూనీడగా ఒకచోటనే వుండిపోతే సరి! అంతగా తప్ప దనుకుంటే యిక్కడే ఉద్యోగం చేద్దువుగానిలే!" అంటూ అర్థాంగిని సముదాయించాడు విజయసారథి. ●